ఉపాధిహామీ వేతనాల చెల్లింపు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధిహామీ పథకం శ్రామికులందరికీ గత నెల పదో తేదీ వరకూ పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించామని డ్వామా పీడీ సుధాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన వేతనాలు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఉపాధి శ్రామికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వేతనాల చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు.

● సముద్రంలో చేపల వేట పునఃప్రారంభం ● తీర ప్రాంతాల్లో మత్స్యకారుల సందడి

హైలెస్సా.. హైలెస్సా





గార మండలం బందరువానిపేట తీరంలో..

ఎచ్చెర్ల/ గార/ పాత శ్రీకాకుళం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రెండు నెలల విరామం తర్వాత సంద్రంలో మోటారు, మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట పునఃప్రారంభమైంది. చేపలు గుడ్లు పెట్టే దశలో మోటారు, మెకనైజ్డ్ బోట్లతో వేటాడితే మత్స్యసంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14న అర్ధరాత్రి వరకు సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తోంది. ఈ క్రమంలో శనివారం రాత్రితో వేట నిషేధం గడువు ముగిసింది. ఆదివారం వేకువజామునే గంగపుత్రులు బోట్లతో చేపలవేటకు బయలుదేరారు. సముద్ర తీరంలో ఎక్కడ చూసినా మత్స్యకారుల సందడి కనిపించింది. జిల్లాలో 193 కిలోమీటర్ల పొడవునా సముద్ర తీరముంది. 11 మండలాల్లో 104 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. సుమారు వెయ్యి మోటారైజ్డ్ బోట్లతో మత్స్యకారులు వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం, గార మండలం బందరువానిపేట తదితర సముద్ర తీరంలో మత్స్యకారులు ఆదివారం వేకువజామున 3 గంటల సమయంలో వేట ప్రారంభించారు. అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో కొద్దిమంది మాత్రమే చేపల వేటకు వెళ్లారు. చాలామంది సంప్రదాయ తెప్పలతోనే వేట సాగించారు. కొద్దిమంది మాత్రమే మోటారు బోట్లను వినియోగించారు. వేట ముగించుకుని.. ఉదయం 11 గంటల తర్వాత బోట్ల

(మిగతా 7వ పేజీలో..)



ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం సముద్రతీరం వద్ద సందడి

మంచం పట్టిన ఊరు

● ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో జ్వరాలు విజృంభించాయి. గత కొద్దిరోజులుగా చాలామంది జ్వరాలబారిన పడ్డారు. శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించింది. ఇంటింటికీ వెళ్లి రక్తనమూనాలు సేకరించింది.

● బూర్జ మండలం గుత్తావల్లి పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల డయేరియా ప్రబలింది. పదుల సంఖ్యలో ఆస్పత్రికి చేరారు. ఎల్.ఎన్.పేట, రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల్లోని చాలా గ్రామాల్లో జ్వరాలు అధికంగా ఉన్నాయి. ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతోంది.



కొండములగాం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

● జిల్లాలో పెరుగుతున్న జ్వరాలు
● డయేరియా కేసులూ నమోదు
● అధ్వానంగా పారిశుధ్యం నిర్వహణ
● జాగ్రత్తలు పాటించకపోతే అంతే
● యంత్రాంగం పనితీరుపై విమర్శలు

రణస్థలం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. మరోవైపు రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఉండడం, గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం వల్ల జ్వరాలు, ఇతరత్రా వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు స్వీయ రక్షణ పాటించడంతో పాటు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టాలి. లేకుంటే ప్రమాదమే. గత ఏడాది జి.సిగడాం మండలం మెట్టవలసలో డయేరియా బారినపడి ఇద్దరు మృతి చెందారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచే జ్వరాలు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా వంటివి అధికంగా నమోదవుతున్నాయి. వైరల్ జ్వరాలు సైతం సోకుతున్నాయి. సాధారణంగా జూలై నుంచి అక్టోబరు వరకు వ్యాధుల కాలం. వీటిని ఎదుర్కొనేందుకు యంత్రాంగం ముందస్తుగా చర్యలు చేపట్టాలి. కానీ జిల్లాలో అటువంటిదేమీ కానరాలేదు. దీంతో ప్రజలు జ్వరాల బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం..

ప్రధానంగా పారిశుధ్యం లోపించిన ప్రాంతాల్లోనే జ్వరాలు వెలుగు చూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మునిసిపాల్టీలు, మేజర్ పంచాయతీల్లో జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో సైతం పారిశుధ్యం అంతంతమాత్రమే. నిధుల కొరత వెంటాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను అచేతనావస్థలో ఉంచింది. దీంతో పారిశుధ్య పనులు జరగడం లేదు. దాని ఫలితంగానే పారిశుధ్యం క్షీణిస్తోంది. వ్యాధుల వ్యాప్తికి కారణమవుతోంది.



జేఆర్‌పురం జాతీయ రహదారిపై వర్షాలతో ప్రవహిస్తున్న మురుగునీరు

వైద్యసేవలు అంతంతమాత్రం..

జిల్లాలో ఇప్పటివరకూ నమోదైన గణాంకాలు పరిశీలిస్తే డయేరియా 581, టైఫాయిడ్ 250, మలేరియా 13 కేసులు నమోదైనట్టు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో అంతకుమించి కేసులు ఉంటాయని సమాచారం. శ్రీకాకుళంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, టెక్కలిలో ఏరియా

(మిగతా 7వ పేజీలో..)

పల్లెల అభివృద్ధే లక్ష్యం

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
● డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీల అమలుకు శ్రీకారం
● రూ.25కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపన

టెక్కలి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 'వైసీపీ ప్రభుత్వం కేవలం హామీలకే పరిమితమైంది. పల్లెల అభివృద్ధిని విస్మరించింది. సీసీ రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోయింది. ఈ నేపథ్యంలో పల్లెల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. 'మన ఊరు- మాటామంతీ' కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రావివలస గ్రామస్థులకు ఇచ్చిన హామీల మేరకు వివిధ అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఒక్క రావివలస పంచాయతీలో చిన్న నారాయణపురం, దామోదరపురం, రావివలస గ్రామాలకు శ్మశానవాటికలకు రహదారులు, దోబీఘాట్, సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, ఎండలమల్లిఖార్జున స్వామి ఆలయానికి రహదారులు ఇలా రూ.12కోట్ల అంచనా వ్యయంతో తొమ్మిది పనులకు శిలాఫలకాలు ప్రారంభించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆ ప్రాంతంలో పర్యటిస్తూ.. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రావివలస జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రహరీ పనుల జాప్యంపై సర్వశిక్ష అభియాన్ డీఈఈ రామానంద్‌పై మంత్రి అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. రావివలసలో (మిగతా 8వ పేజీలో..)



రావివలసలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

కేంద్ర గ్రంథాలయాన్ని పరిరక్షించుకోవాలి
● గ్రంథాలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా 7లో

మరుగుదొడ్లు లేవు.. తాగునీరు లేదు
● నిర్వహణ లేక శిథిలావస్థకు చేరిన వైనం
● ఇదీ గార ఆర్టీసీ బస్టాండ్‌లో పరిస్థితి 7లో



ఆదిత్యుని ఆలయానికి పోటెత్తిన భక్తులు
● ఒక్కరోజే స్వామికి రూ.8,56,135 ఆదాయం 7లో

నా భర్తపై చేసిన ఆరోపణలు నిరూపించాలి
● లేకుంటే గుండు చేయించుకుని క్షమాపణ చెప్పాలి
● మాజీ మంత్రి అప్పలరాజుకు ఎమ్మెల్యే శిరీష డిమాండ్ 8లో

వృద్ధులపై నిర్లక్ష్యం తగదు
● టెక్కలి సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల



ఓ పరిశ్రమలో నిల్వ చేసిన జీడిపప్పు బాక్స్‌లు

తెరుస్తారా? లేదా?

● జీడి పరిశ్రమల బంద్‌పై తొలగని సందిగ్ధం
● ధర్నాకు కార్మిక సంఘ నాయకులు సిద్ధం

పలాస, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జీడి పరిశ్రమలు 15 రోజులుగా బంద్ నిర్వహిస్తున్నాయి. జీడి పిక్కలు అధిక ధరలు, మార్కెట్‌లో జీడిపప్పునకు మార్కెట్ లేకపోవడం, వ్యాపారుల వద్ద టన్నులకొద్దీ జీడిపప్పు నిల్వ ఉండిపోయిన కారణంగా పలాస క్యాజూ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ గత నెలాఖరు నుంచి పరిశ్రమలను మూసేసింది. వారిచ్చిన గడువు ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో కార్మిక సంఘ నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సోమవారం నుంచి పరిశ్రమలు తెరవకపోతే తాము పీసీఎంఏ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించడంతో జీడి మార్కెట్‌లో ఉత్కంఠ నెలకొంది. బంద్ చేసినా ఇంకా మార్కెట్ గాడిలో పడలేదని వ్యాపారులు చెబుతున్నారు. మరో రెండు వారాలు బంద్‌కు అవకాశం ఇస్తే ఆ తర్వాత పనులు కల్పించవచ్చని వారు చెబుతుండడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

● పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో 240కిపైగా జీడి పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 10వేల మందికిపైగా కార్మికులు పని చేస్తుండగా ఇందులో 95 శాతం మహిళలే ఉన్నారు. ఒక్కో కార్మికురాలు రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకూ వేతనం సంపాదించుకుంటారు. పరిశ్రమలు బంద్ చేయడంతో (మిగతా 8వ పేజీలో..)

4,156 మంది ఉపాధ్యాయులకు బదిలీ


● సజావుగా ముగిసిన ప్రక్రియ
● నేటి నుంచి కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరాలని ఆదేశం

నరసన్నపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల(ఎస్జీటీ) బదిలీ కౌన్సిలింగ్ శనివారం అర్ధరాత్రితో ముగిసింది. గ్రేడ్ -2 హెచ్‌ఎం, పీఎస్‌హెచ్‌ఎంలు, పీడీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు మొత్తం 6,392 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 4,156 మంది స్థానచలనమయ్యారు. ఇందులో ఎస్జీటీలు 1,962 మంది ఉండగా.. బదిలీ కౌన్సిలింగ్ ప్రక్రియ మాన్యువల్‌గా నిర్వహించారు. మిగిలిన 2,194 మంది స్కూల్ అసిస్టెంట్లు, గ్రేడ్-2 హెచ్‌ఎంలు, పీఎస్ హెచ్‌ఎంలు. ఉమ్మడి జిల్లాలో 2,860 మంది ఎస్జీటీలు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,822 మంది తప్పనిసరిగా బదిలీపై వెళ్లారు. 1048 మంది రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోగా సుమారు 140మందికి అవకాశం దక్కింది. అలాగే 124 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి లభించింది.

స్పౌజ్‌లో కొందరికి చిక్కులు

పోలాకి మండలంలో పనిచేస్తున్న తామరాపల్లికి చెందిన ఒక ఉపాధ్యాయుని స్పౌజ్ వినియోగించుకున్నారు. భర్త మందస మండలంలో పనిచేయడంతో భార్య కూడా అదే మండలానికి వెళ్లాల్సి వచ్చింది. ఇలా ఎందరో స్పౌజ్ వినియోగించుకున్న ఉపాధ్యాయులు బదిలీల్లో ఇబ్బందులు

(మిగతా 8వ పేజీలో..)





గొప్పిలి సచివాలయం

ఇక సచివాలయాల్లో..

● ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తయిన వారికి స్థానచలనం తప్పనిసరి
● ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వ ఆదేశం
● సొంత మండలాల్లో పనిచేస్తున్న వారిని కదిలించాలని స్పష్టం

మెళియాపుట్టి/ నరసన్నపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 30వ తేదీలోగా బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్లకు స్పష్టం చేసింది. సచివాలయాల్లో ఈ ఏడాది మే 31నాటికి ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తిచేసిన వారికి బదిలీ చేయనుంది. ఉద్యోగుల హేతుబద్ధీకరణతోపాటు బదిలీల ప్రక్రియకు మార్గదర్శకాలను జారీ చేసింది. సొంత మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర మండలాలకు బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. హేతుబద్ధీకరణకు సంబంధించి క్లస్టర్లను పరిగణలోకి తీసుకోనుంది. ఈ నేపథ్యంలో

(మిగతా 8వ పేజీలో..)

మంచం పట్టిన ఊరు

(ఐదో పేజీ తరువాయి)

ఆస్పత్రి పెద్దాస్పత్రులుగా ఉన్నాయి. వీటితోపాటు 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సీహెచ్‌సీలు, 300 వరకు ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో వైద్యసేవలు సక్రమంగా అందక రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఏటా వర్షాకాలం నాటికి వైద్యారోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టేది. ప్రమాదకర జ్వరాలు, వ్యాధుల నియంత్రణకు ఎలా ముందుకెళ్లాలి అన్నదానిపై ఉన్నతస్థాయిలో అధికారులు సమీక్షించేవారు. ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచేవారు. ఆస్పత్రి సలహా మండలి సమావేశాలు నిర్వహించేవారు. ఈ ఏడాది ఆ ప్రణాళిక కొరవడింది. దీనికితోడు గ్రామాల్లో పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో దోమలు స్వైరవిహారం చేసి వ్యాధులు పెరుగుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ నామమాత్రపు చర్యలకే పరిమితమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డెంగ్యూ నిర్ధారణకు ప్రామాణికమేదీ?

డెంగ్యూ జ్వరాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. వీటి నిర్ధారణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దిష్టమైన సూచనలు చేసింది. ర్యాపిడ్ పరీక్షలు ద్వారా నిర్ధారణ అయిన తరువాతే చికిత్స అందించాలి. అయితే వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ర్యాపిడ్ పరీక్షను పరిగణలోకి తీసుకోబోమని చెబుతోంది. ఇంతలో రోగి ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. అయితే ఎలిషా పరీక్ష తరువాతే రోగికి వైద్యసేవలందిస్తామని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. ఈ పరీక్షకు సంబంధించి పీహెచ్‌సీల్లో ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. జిల్లాకు సంబంధించి సర్వజన ఆస్పత్రి(రిమ్స్)లో మాత్రమే జరుగుతున్నాయి. దీంతో వైద్యసేవల్లో జాప్యమవుతోంది. జిల్లాలోని ఎంపిక చేసిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలీషా పరీక్షలు చేయాల్సిన అవసరం ఉంది.

ముందస్తు చర్యలు..

ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. అన్ని ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాం. ప్రజలు పరిశుభ్రతను పాటించాలి. వేడినీటినే తాగాలి. ఆహార పదార్థాలపై మూతలు వేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

- కె.అనిత, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం

హైలెస్సా... హైలెస్సా

(ఐదో పేజీ తరువాయి)

ఒడ్డుకు చేరుకున్నారు. కాగా.. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో అరకొరగానే చేపల వేట సాగినట్టు మత్స్యకారులు తెలిపారు.

వేట సరిగా లేదు



సముద్రంలో అలలు తాకిడి ఎక్కువగా ఉంది. దీంతో చేపల వేట సరిగా సాగలేదు. రెండు నెలల తర్వాత వేటకు బయలుదేరాం. వేట సరిగా లేకపోవడంతో నిరాశకు గురయ్యాం.మరికొద్ది రోజులు పరిస్థితి ఇలానే ఉంటుంది.

- గనగళ్ల రామారావు, డి.మత్స్యలేశం

కష్టమే మిగిలింది



ఆదివారం వేకువజామునే చేపల వేటకు బయలుదేరాం. వాతావరణ పరిస్థితులు సరిగా లేనికారణంగా చాలామంది చేపల వేటకు రాలేదు. ఒకటి, రెండు మోటారు బోట్లు మినహా మిగిలినవన్నీ సంప్రదాయ తెప్పలతోనే వేట సాగింది. ఆశించినస్థాయిలో మత్స్య సంపద లభ్యం కాక.. కష్టమే మిగిలింది.

- కుందు లక్ష్మణరావు, డి.మత్స్యలేశం

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సముద్రతీర ప్రాంతాల్లో ఆదివారంనుంచి వేట పునఃప్రారంభమైంది. జిల్లాలో 15,548 మంది మత్స్యకారులు చేపలవేటపై జీవనం సాగిస్తున్నారు. వేట నిషేధ సమయంలో పరిహారం ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.20వేలు చొప్పున రూ.31.09 కోట్లు అందజేసింది. జిల్లాలో సుమారు 1600 మోటరైజ్డ్ బోట్లు, 2700 ఇంజిన్ లేని చిన్న బోట్లు ఉన్నాయి. బోట్లకు ఇండియా యూనిట్ కోడ్ రిజిస్ట్రేషన్ నంబర్ ఉండాలి. మూడేళ్లకోసారి రిజిస్ట్రేషన్‌ను రెన్యువల్ చేసుకోవాలి.

- వై.సత్యనారాయణ, మత్స్యశాఖ ఉప సంచాలకుడు

ఆదిత్యుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



జస్టిస్ గేదెల తుషార్‌రావుకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో ప్రసాద్

అరసవల్లి, జూన్15(ఆంధ్రజ్యోతి):అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి వారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారి నుంచే ఆదిత్యుని ఆలయంలోని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.8,56,135ల ఆదాయం లభించింది.ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.5,24,200లు, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ. 2,04,815లు, విరాళాల ద్వారా రూ.1,08,120లు, షాపుల నుంచి ఆసీలు వసూళ్ల రూపంలో రూ.19,000లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో కేఎన్‌వీడీ ప్రసాద్ తెలిపారు. కాగా స్వామివారిని డిల్లీ హైకోర్టుకు చెందిన జడ్జి జస్టిస్ గేదెల తుషార్‌రావు దర్శించుకున్నారు.ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు స్వాగతం పలికి అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారికి స్వామివారి చిత్రపటాన్ని ఈవో ప్రసాద్ అందజేశారు. కాగా ఆలయ పరిసరాల్లో దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి వద్ద నుంచి షాపునకు రూ.500లు చొప్పున సిబ్బంది ఈవో ప్రసాద్ ఆదేశాల మేరకు వసూళ్లు చేశారు. దీంతో కొందరు వ్యాపారులు ఈవోను కలిసి ప్రశ్నించారు.గతంలో ఇక్కడ వ్యాపారాలు చేసుకునేవారు నెలవారీ అద్దెలు చెల్లించేవారని ఈవో చెప్పారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

శ్రీకాకుళంకల్చరల్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని డీసీసీబీ కాలనీలో గల భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలిరోజు అర్చకులు చామర్తి జగన్నాథచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, ఆరాధన,అనంతరం స్వామి వారికి కల్యాణ మహోత్సవం జరిపించారు. ఈ నెల 17న స్వామి వారికి పుష్ప యాగం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మిథున సంక్రమణ పూజలు

ఇచ్ఛాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారి దేవాలయం పూజాకమిటీ ఆధ్వర్యంలో మిథున సంక్రమణ పురస్కరించుకునిఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గాంధీపార్కు ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి, మండపల్లి గారపోలమ్మ తల్లి అమ్మవారి దేవాలయాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

●కంచిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రధాన ఆలయాల్లో మిథున సంక్రమణం పురస్కరించుకుని భక్తులు పూజలు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

ఆమదాలవలస, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగుచేస్తున్న పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక ధర ఉంటుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ తెలిపారు.ఆదివారం మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల్లో క్షేత్ర పర్యటనలో భాగంగా డీపీఎం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరించే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రణస్థలం, జూన్15(ఆంధ్రజ్యోతి): పతివాడపాలెం జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లావేరు మండలంలోని చిగురుకొత్తపల్లికి చెందిన సీహెచ్ సాయి(24) మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. విశాఖ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న సాయి ముందు ఉన్న వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.



కనీస సౌకర్యాలకు నోచుకోని గార ఆర్టీసీ బస్టాండ్

మరుగుదొడ్లు లేవు.. తాగునీరు లేదు

●నిర్వహణ లేక శిథిలావస్థకు చేరిన వైనం
●ఇదీ గార ఆర్టీసీ బస్టాండ్‌లో పరిస్థితి

గార, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గారలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. మరుగుదొడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు సైతం లేవు. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన బస్టాండ్ నిర్వహణ లోపం వల్ల శిథిలావస్థకు చేరింది.

గారలో మూడు దశాబ్దాల కిందట మూడు రోడ్ల కూడలిలో చుటుపక్కల గ్రామాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్ నిర్మించారు. తర్వాత కాలంలో కనీస మరమ్మతులు, నిర్వహణకు నోచుకోకపోవడంతో స్తంభాలు బీటలు వారిపోయాయి. గోడలకు పెచ్చులూడుతున్నాయి.దీంతో ఇక్కడకు వచ్చే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం బల్లలు లేకపోవడంతో సిమెంట్ దిమ్మల మీద కూర్చోవల్సి వస్తోంది. బందరువానిపేట, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు వెళ్లే వారంతా చెట్ల కింద, దుకాణాల చెంతన ఉంటున్నారు. శ్రీకాకుళంలోని పలు విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు రోడ్డుపైనే వేచిఉంటున్నారు.బస్టాండ్‌లో కూర్చోడానికి బల్లలు లేక చెట్టు కింద వాహనాలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంలో చీకటిపడిన తర్వాత అంధకారంగా మారుతోంది. తాగునీరు, మరుగుదొడ్లువంటి సదుపాయాలు లేకపోవవడంతో మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సాగు నీరందించేందుకు చర్యలు

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



మడ్డువలస కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మడ్డువలస కాలువ ద్వారా ఖరీఫ్‌కు సాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) తెలిపారు. ఆదివారం జి.సిగడాం, పొందూరు మండలాల సరిహద్దులో బొట్టపేట వద్ద గల మడ్డువలస కాలువను ఆయన పరిశీలించారు. మడ్డువలస కాలువ ఏర్పడినప్పటి నుంచి తమ గ్రామ పరిధిలోని ఆయకట్టుకు నీరందడంలేదని వాండ్రంగి గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.దీంతో స్పందించిన ఎమ్మెల్యే రైతులు, మడ్డువలస ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట ఎస్ఈ పొగిరి సుగుణాకరరావు, డీఈఈ నాగేశ్వరరావు, ఏఈ రాజశేఖర్, నాయకులు కుమరాపు రవికుమార్, బూరాడ వెంకటరమణ, వజ్జపర్తి రఘురాం, ఫైల విష్ణుమూర్తి, సాకేటి నాగరాజు, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, డాక్టర్ చింత మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ఇచ్ఛాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తమ వార్డులో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలోని 20వ వార్డు రత్తకన్న మహిళలు కోరారు.ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు రామయ్యపుట్టుగలో కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి వార్డు పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ పితాంబర్, సీహెచ్ బుడ్డెమ్మ, కె.లక్ష్మి, కె.రఘురామ్, సాయమ్మ, దర్గాసి లక్ష్మమ్మ, మట్ట విమల, కె.లలిత పాల్గొన్నారు.

నారాయణపురం కాలువలో జంగిల్ క్లియరెన్స్

ఎచ్చెర్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నారాయణపురం కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. ఎచ్చెర్ల మండలంలోని అఖిఖాన్‌పేట వద్ద ప్రధాన కాలువలో పనులను ఆదివారం చేపట్టారు. కుశాలపురం నుంచి భగీరథీపురం వరకు ఉన్న ప్రధాన, బ్రాంచ్ కాలువల్లో ఆపరేషన్ అండ్ మెంటినెన్స్ నిధులు రూ.15 లక్షలతో జంగిల్ తొలగిస్తున్నారు.కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈఈ వై.రవీంద్ర, ఏఈ కె.రాంబాబు, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, టీడీపీ మండలాధ్యక్షుడు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయాన్ని పరిరక్షించుకోవాలి

● గ్రంథాలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

అరసవల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్థులకు పోటీపరీక్షలు, అధ్యయనానికి నిలయంగా ఉన్న కేంద్ర గ్రంథాలయాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నిరుద్యోగులు, విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రజలపై ఉందని పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట గ్రంథాలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయ ఆస్తులను అభివృద్ధి పేరుతో అన్యాక్రాంతం చేయవద్దని, ఆ ప్రయత్నాలను విరమించుకోకపోతే ప్రజల మద్దతుతో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. బయట డబ్బులు చెల్లించి చదువుకోలేని నిరుద్యోగ యువతకు గ్రంథాలయం ఎంతోగానో ఉపయోగపడుతోందని తెలిపారు. వెనుక ఉన్న ఖాళీ స్థలంలో అదనపు భవనాలను నిర్మించి ఆధునీకరించాలని డిమాండ్‌చేశారు. డీఎస్సీతో పాటు త్వరలో పోటీ పరీక్షలు జరగనున్న తరుణంలో భవనాన్ని కూల్చివేస్తే, నిరుద్యోగులు, విద్యార్థులకు శాపంగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయపరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కరణం బుచ్చి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి తమరివైకుంఠరావు, గరిమెళ్ల విజ్ఞానకేంద్రం అధ్యక్ష,కార్యదర్శులు ఎం.ప్రభాకర్, పి.సుధాకర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, తంగా ఎర్రమ్మ, ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు, కొత్తకోట అప్పారావు, చలపతిరావు, ఎం.శ్రీనివాసరావు, గొంటి గిరిధర్ పాల్గొన్నారు.



కేంద్ర గ్రంథాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నేడు మీకోసం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 15(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక, మీకోసం(పీజీఆర్ఎస్) సోమవారం జరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒకప్రకటనలో తెలిపా రు.అర్జీదారులు వారి అర్జీలను మీకోసం. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

22న ఒలింపిక్ డే రన్

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి కోడిరామ్మూర్తి స్టేడియం వరకూ ఈనెల 22న ఒలింపిక్ డే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు.ఆదివారం శ్రీకాకుళంలోని ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలోగల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, శిక్షకులతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ప్రతి నిధులు ఎంఎస్ఆర్ కృష్ణమూర్తి, హారికా ప్రసాద్, పి.సుందరరావు, ఖాసీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు రమణ, రమణ, మెట్ట తిరుమలరావు, వై.పోలినాయుడు, పురుషోత్తమ్, మురళి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

శ్రీకాకుళంక్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, నేర చరిత్రకు స్వస్తి పలికి సత్ప్రవర్తనతో మెలగాలని టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలవాలి



జ్ఞాపికలతో అతిథులు

అరసవల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉన్నత స్థాయిలో నిలవాలని పారామెడికల్ విద్యార్థులకు జెమ్స్ చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు సూచించారు. ఆదివారం జెమ్స్ ఆడిటోరియంలో బొల్లినేని మెడిస్కిల్స్ బీఎస్సీ పారా మెడికల్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. బీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ బొల్లినేని శీనయ్య మాట్లాడుతూ జీవితంలో ప్రతిఒక్కరికీ అవకాశం వస్తుందని దానిని అందిపుచ్చుకోవాలన్నారు. జెమ్స్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ నిబద్ధత, కఠిన శ్రమ,జట్టుతో కలిసి పనిచేయడం అలవరచుకున్నవారే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.జెమ్స్ సూపరింటెండెంట్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి పిల్లలు చేరుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తేనే ఉద్యోగాల్లో ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు.కళాశాల ఈడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ తమవిద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగాల కల్పనే ధ్యేయమన్నారు. అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీప్రణతి వార్షిక ప్రగతి నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ, కళాశాల స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులను సత్కరించారు.కార్యక్రమంలో జెమ్స్ సీఈవో ఆద్విక్, సీఏవో ఎస్.రామ్మోహన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌పీఎల్ విజేతగా సింగుపురం

శ్రీకాకుళం రూరల్, జూన్15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలోని సింగుపురంలో నెలరోజులుగా జరిగిన ఎస్‌పీఎల్-7 ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి.ఈ సందర్భంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సింగుపురం జట్టు మునసబుపేట జట్టును ఓడించి విజేతగా నిలిచింది. అనంతరం సింగుపురం జట్టుకు ట్రోఫీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పొట్నూరు కొండలరావు పాల్గొన్నారు.

ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటుచేయాలి

అరసవల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దళిత, ఆదివాసీలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటుచేసేలా తీర్మానించాలని భీమ్‌సేన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవి సిద్దార్థ డిమాండ్‌చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో భీమ్‌సేన ఉత్తరాంధ్ర యువ సమ్మేళనం తృతీయ సదస్సు జరిగింది. కార్యక్రమంలో కల్లేపల్లి రాంగోపాల్, నగిరి.మోహనరావు, కంఠ వేణు, బడియా కామరాజు, డి.గణేష్, బోయిడి మురళీకృష్ణ, బోనెల రమేష్, బత్తిన మోహనరావు, లింగాల అప్పన్న, శరత్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం

ఆమదాలవలస, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చాపర సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ తనను ఎన్టీఆర్ హెల్త్ యూనిర్శిటీ మెంబర్‌గా ఎంపిక చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.సుధాకర్‌ను టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బి.రమణమూర్తి, కూన ఆంజనేయులు, బోర గోవిందరావు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల పరిశీలకుల నియామకం

ఎచ్చెర్ల, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన నాయకులకు విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బొబ్బిలి, గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ సంస్థాగత ఎన్నికలకు పరిశీలకులుగా పార్టీ అధిష్ఠానం నియమించింది. బొబ్బిలి పరిశీలకుడిగా డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్‌ను, గజపతినగరం పరిశీలకుడిగా కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావులను నియమించారు.

సోంపేటలోని షాపుల్లో తనిఖీలు

సోంపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎస్ఐ లవరాజు ఆధ్వర్యంలో పోలీస్ జాగిలం రాణి డాగ్‌స్క్వాడ్ బృందాలతో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల గంజాయి ఎక్కువ మొత్తంలో పట్టుబడుతుండడంతో పలు షాపులు, మాల్స్‌లో తనిఖీలు చేశారు.

నడక పోటీలో కవిటి యువకుడి ప్రతిభ

కవిటి, జూన్15 (ఆంధ్రజ్యోతి):కవిటికి చెందిన ఎం.సతీష్ ఏపీ సీనియర్ స్టేట్ అంతర్ జిల్లాల అథ్లెటిక్ చాంపియన్ షిప్-2025లో నడక పోటీలో ప్రతిభ చూపాడు. శని,ఆదివారాలు గుంటూరులోని ఎన్‌జీరంగా యూనివర్సిటీలో జరిగిన పోటీలో పురుషుల విభాగంలో 20 కిలోమీటర్ల నడక పోటీలో మూడోస్థానం సాధించాడు.జిల్లాస్థాయిలో జరిగిన పోటీలో ప్రథమస్థానాన్ని పొందిన సతీష్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. సతీష్‌కు కవిటిలోని క్రీడాకారులు అభినందించారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు



ధర్మవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బొడ్డేపల్లి సురేష్

ఎచ్చెర్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి):యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సమాజసేవకుడు, సన్‌రైజ్ ఆసుపత్రి అధినేత డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని ధర్మవరం గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 250 మందికి రక్తపరీక్షలు, ఈసీజీ చేసి అవసరమైన మందులను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయాబెటిక్, బీపీ, కీళ్లవాతలతో ఎక్కువ మంది బాధపడుతున్నారని చెప్పారు. సన్‌రైజ్ ఆసుపత్రిలో ప్రతి శనివారం ఉచితంగా ఓపీ చూస్తున్నట్లు తెలిపారు. ఫిజియోథెరపిస్ట్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆధునాతన టెక్నాలజీతో మధుమేహం వల్ల కీళ్లవాతలు, నరాల బలహీనతకు మెరుగైన వైద్యమందిస్తామన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బగ్గు రాజారావు, సర్పంచ్ అల్లు కన్నబాబు, గ్రామ పెద్దలు శ్యామలరావు, రుప్ప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

కవిటి, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొత్తిడిపుట్టుగ గ్రామానికి చెందిన పి.పురుషోత్తం కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఆయనతో పదో తరగతి చదివిన స్నేహితులు,ఎస్‌జీఎఫ్ సభ్యులు రూ.27వేలు అందజేశారు.

బీచ్‌లో మృతదేహం గుర్తింపు

సోంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గొల్లగండి సమీపంలోని బీచ్‌లో సోంపేట జాలారి వీధికి చెందిన కాశి కూర్మారావు మృతదేహం ఆదివారం సాయంత్రం గుర్తించారు. సాయంత్రం పలువురు మత్స్యకారులు మృతదేహాన్ని గమనించి, మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు బారువ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ కృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదుచేశారు. మృతుడు పెయింటింగ్ పనులు చేసి జీవిస్తున్నాడు. కూర్మారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి


జగదీష్ (ఫైల్)

సోంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పొట్టి జగదీష్ ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సోంపేట మండ లంలోని ఎర్రముక్కాం గ్రామానికి చెందిన పొట్టి జగదీష్ శనివారం టెక్కలి జాతీయ రహదారి వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా ఆదివారం మృతి చెందాడు. జగదీష్‌కు భార్య పుష్ప, కుమారుడు సాయి ఉన్నారు.

10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

నరసన్నపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలం దేవాది గ్రామం వద్ద ఓ చెరువు గట్టుపై ఆదివారం పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలి పారు. గ్రామ శివారులో చెరువు గట్టుపై పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రూ. 6,850 నగదుతో సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'బోయిన'కి మాతృ వియోగం


నివాళులర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు (ఇన్‌సెట్‌లో) ప్రేమకుమారి (ఫైల్)

టెక్కలి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర బీసీ సాధికారత కళింగ కోమటి కన్వీనర్, రాష్ట్ర కళింగ కోమట్ల సంఘ అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు తల్లి బోయిన ప్రేమకుమారి (90) ఆదివారం కోటబొమ్మాళిలో తన నివాసంలో మృతిచెందారు. ఈమెకు ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె. వీరిలో బోయిన రమేష్ కోటబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. అలాగే బోయిన గోపాలరావు, బోయిన సత్యానందం, బద్రి, మన్మథరావుతో పాటు కుమార్తె మంగమ్మ. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించ నున్న ట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రేమకుమారి మృతి పట్ల కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, నేతలు కింజరాపు వరప్రసాద్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, నంబాళ్ల శ్రీనివాస్, లాడి శ్రీని వాసరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ప్రేమ కుమారి మృతిపై మంత్రి అచ్చెన్నాయుడు సంతాపం తెలిపారు. ఆది వారం రాత్రి కోటబొమ్మాళిలో వారి నివాసానికి వెళ్లిన మంత్రి ప్రేమ కుమారి భౌతిక కాయంపై పూలమాల ఉంచి నివాళి అర్పించారు. ప్రేమకుమారి మృతి తీరని లోటని మంత్రి అన్నారు.

'బోయిన' మాతృమూర్తి మృతికి సంతాపం

పలాస, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కళింగ కోమట్ల సంఘం అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్ తల్లి ప్రేమకుమారి మృతి తీరని లోటని పారిశ్రామిక జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతికలగాలని కోరుకుంటూ సంతాపం తెలిపారు.

కోళ్లఫారంలో నాగుపాము కలకలం


పడగవిప్పిన నాగుపాము

ఎల్.ఎన్.పేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కోవిలాం గ్రామంలోని కోళ్ల ఫారంలో ఆదివారం నాగుపాము కలకలం సృష్టించింది. ఒకగదిలో నాగు పాము సంచరించడంతో కోళ్లఫారం యజమాని గమనించి అక్కడి నుంచి నాగుపామును తరిమేందుకు ప్రయ త్నించినా ఫలితం లేకపోయింది. పడ గ విప్పి బుసలు కొట్టడంతో ఒక్కసారి భయభ్రాంతులకు గుర య్యారు. విషయం తెలుసుకున్న లక్ష్మీనర్సుపేట జంక్షన్ లోని ముయ్యి రాజు వచ్చి చాకచక్యంగా పామును పట్టుకొని దూరంగా విడిచిపెట్టారు.

రెండు కార్లు ఢీ: తప్పిన ప్రమాదం

కొత్తూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొత్తూరు-పాలకొండ మార్గంలో ఆదివారం ఉదయం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో రెండూ నుజ్జునుజ్జయ్యాయి. అయితే కారులో ఉన్నవారు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొత్తూరుకు చెందిన ప్రైవేటు డెంటల్ వైద్యుడు కొత్తూరు నుంచి పాలకొండ వైపు వెళతుండగా, పాలకొండ నుంచి కొత్తూరు వైపు వస్తున్న కారు ఢీకొన్నాయి. కార్లలో ఉన్న బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణా పాయం నుంచి బయట పడ్డారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన వారు స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్లు తెలిసింది. అయితే రెండుకార్ల యజమానులు పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. ఈ విషయమై ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ వద్ద ప్రస్తావించగా పాలకొండ మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొత్తూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం గూనభద్ర వద్ద ఆదివారం రాత్రి మెట్టూరు వైపు వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. టీవీస్ ఎక్స్‌ఎల్ నడుపుతున్న పెద్దకోట శిమ్మన్న, పల్సర్ వెనుక కూర్చున్న ఎడ్ల సంజీవరావుకు తీవ్ర గాయాలయ్యాయి. పెదకోట కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ ఎండీఅమీర్ ఆలీ తెలిపారు.

బీజేపీలో చేరిన చింతలబడవంజ గ్రామస్థులు

ఎల్.ఎన్.పేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చింతలబడవంజ గ్రామానికి చెందిన 40 కుటుంబాలు ఆదివారం బీజేపీలో చేరాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.తేజేశ్వరరావు వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రధాని మోదీ భావాలను ఆదర్శంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహంతి రవి, నాయకులు జి. వెంకటరమణ, జి.సోమేశ్వరరావు, రవీంద్ర పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

నా భర్తపై చేసిన ఆరోపణలు నిరూపించాలి

- లేకుంటే గుండు చేయించుకుని క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి అప్పలరాజుకు ఎమ్మెల్యే శిరీష డిమాండ్


మాజీ మంత్రి అప్పలరాజు నిర్వహించిన ఔషధ కంపెనీ వివరాలు చూపిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తన భర్తపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన ఆరోపణలు ఆధారాలతో నిరూపించాలని, లేకుంటే తన కార్యాలయానికి వచ్చి గుండు చేయించుకుని చెప్పుతో కొట్టుకుని క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే గౌతు శిరీష డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అప్పలరాజు ప్రశ్నలకు తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ఓటు వేసిన ప్రజలకు సమాధానం చెబుతానని స్పష్టం చేశారు. అవినీతి పార్టీ నుంచి పుట్టుకు వచ్చిన మాజీ మంత్రి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, వాటిని ఇంకా ఆపకపోవడం దారుణ మన్నారు. తన భర్తపై చేసిన నిరాధార ఆరోపణలు, వ్యాఖ్యలు నీ విజ్ఞతకే విడిచిపెడుతున్నానన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న మాజీ మంత్రి నగరం నడిబొడ్డున రాజా లాడ్జి భవనాన్ని రూ.12 కోట్లకు ఎలా కొనుగోలు చేశారని, ఆ కిటుకు ప్రజలకు చెప్పాలన్నారు. బొడ్డపాడు ఎంఐజీ లే అవుట్ స్థలాల కొనుగోలులో 12 శాతం ముందస్తు కమీషన్ రైతుల వద్ద కొట్టిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నిం చారు. టీడీపీ యువనేత బడ్డ నాగరాజు ఇంటి ముందు ఉన్న రోడ్డును విరగొట్టేందుకు 400 మంది పోలీసులతో కాపలాకాయించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఘనత మాజీ మంత్రికే దక్కుతుందని, చివరకు ఆయ నను హత్య చేయించేందుకు కూడా వెనుకాడలేదన్నా రు. హల్‌మార్కు నకిలీ మందులు అమ్మించారని, నల్ల బొడ్లూరు కొండలో కంకర అమ్ముకున్నారని ఆరోపించారు. వీటిపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

ఏడాదిలో ఎంతో అభివృద్ధి

తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాదిలోనే నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. రూ.515 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చిందని పేర్కొంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్రచీఫ్ పురందేశ్వరికి కృత జ్ఞతలు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామికవాడలు ఏర్పాటు చేసి కొత్త పరిశ్రమలతో వేలా ది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. వంశధార ద్వారా సాగునీరందించామని, ఆఫ్ షోర్‌కు రూ.110 కోట్లు నిధులు విడుదల చేయించామన్నారు. కిడ్నీ పరిశోధన కేంద్రంలో డయాలసిస్ యూనిట్లు, రూ.110 కోట్లతో ఇంటింటికీ తాగునీటి పథకం, కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణం, పూడిలంక వారధికి అనుమతులు తీసుకువచ్చామన్నారు. తాను చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తున్నానని, ప్రజల ఆదరాభిమానాలతో ఏడాదిలోనే భారీస్థాయిలో నిధులు తీసుకువచ్చానన్నారు.

వృద్ధులపై నిర్లక్ష్యం తగదు

- సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల


టెక్కలి: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల

టెక్కలి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వృద్ధులపై నిర్లక్ష్యం తగదని, వారిని గౌరవించడం మనందరి బాధ్యత అని సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. ఆదివారం కోర్టు సముదాయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధ తల్లిదండ్రులను పిల్లలు నిరాదరణకు గురిచేస్తే భరణంపై కేసు వేయవచ్చన్నారు. వృద్ధులను వేధించడం, దూషించడం చట్టరీత్యా నేరమని పేర్కొంటూ వారి హక్కులను వివరించారు. వృద్ధులకు సమస్యలుంటే కోర్టు పరిధిలో న్యాయసేవాధికార సంస్థలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ పట్నాయక్, మధుబాబు, బొడ్డ అయ్యబాబు, ధవళ కృష్ణారావు, రాంబాబు, చిట్టిన్న, హరిశ్చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధులను మర్యాదగా చూడండి

పలాస, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, వయోవృద్ధులను మర్యాదగా చూడాలని పలాస జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి అన్నారు. ఆదివారం స్థానిక కోసంగిపురం లలితా చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో వయో వృద్ధులు, మానసిక వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డులు మండల న్యాయ సేవాధికార సంఘం ద్వారా అందించనున్నామన్నారు. వృద్ధులను ఆదరిస్తున్న ట్రస్టు నిర్వాహకుడు ఎస్. చిన్నికృష్ణను అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీకేఆర్ పట్నాయక్, ఏజీపీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్‌రాజు, కె. దేవరాజు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మన్మథరావు పాల్గొన్నారు.


పలాస: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి మాధురి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


2004-05 సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు

సంతబొమ్మాళి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-2005 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ప్రస్తుత పరిస్థితులను తెలుపుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు తంగి వెంకటరమణ, ప్రసాద్ తదితరులను సత్క రించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్ర మంలో పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు ముద్దపు ఆనందరావు, గొనప రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

ఆర్అండ్‌బీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పక్కాగా చేపట్టాలని డీఈఈ రవికాంత్‌కు సూచించారు. అలాగే టెక్కలి మేజర్‌పంచాయతీ పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధికి రూ.13కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేశారు. కోనేరు ప్రాంతంలో కన్సల్టెన్సీ నమూనా ప్రకారం చేపట్టాల్సిన పనులపై పంచాయతీరాజ్ డీఈఈ సుధాకర్‌కు దిశానిర్దేశం చేశారు. టెక్కలికి తలమానికంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రావివలస ఎండలమల్లిఖార్జున స్వామిని మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో కృష్ణమూర్తి దర్శించుకున్నారు. ఈవో గురునాథరావు, అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు.

'తల్లికి వందనం' అందిందా.. లేదా :

రావివలస, చిన్ననారాయణపురం, దామోదరపురం గ్రామాల్లో మహిళలతో మంత్రి అచ్చెన్న మాట్లాడారు. 'తల్లికి వందనం' పథకం అందిందా? లేదా? అని ప్రశ్నించారు. ఒక్కో ఇంట్లో ఇద్దరు.. ముగ్గురికి చొప్పున కూడా తల్లికి వందనం డబ్బులు తమ ఖాతాల్లో జమయ్యాయని మహిళలు చెప్పారు. ఈ నెలలోనే రైతుభరోసా కూడా అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కింజరాపు ప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, ఎల్ఎల్ నాయుడు, చౌదరి బాబ్జీ, బడే జగదీష్, నర్తు కృష్ణ, జనార్దన్‌రెడ్డి, ఇప్పిలి జగదీష్, మామిడి రాము, కామేసు, దమయంతి, సుందరమ్మ, కింగ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంతో ఆనందోత్సాహం



నరసన్నపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తామరాపల్లి గ్రామంలో తల్లికి వందనం పథకం లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నా యుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ పథకం వర్తించడంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గొద్దు జగన్మోహన్‌రావు, బైరి తవిటియ్య, కోల రాము, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

నందిగాం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నందిగాం గణేష్ కాలనీలో వరసిద్ధి వినాయక ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, శ్యామల దంపతులు, కాలనీవాసుల ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్‌శర్మ పర్యవేక్షణలో సుప్రభాతసేవ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, విశేషాభిషేకాలు, గణపతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు.

పార్టీలకు అతీతంగా సేవలు: ఎంజీఆర్


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

పాతపట్నం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలను పార్టీలకు అతీతంగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలం మండలం దన్ను పురానికి చెందిన మామిడి ఢిల్లమ్మకు రూ.2లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం పాతపట్నం క్యాంపు కార్యాలయంలో అందించారు. ఢిల్లమ్మ భర్త చిన్న వాడు ఆకస్మిక మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడు తున్నందున సీఎంఆర్ఎఫ్ మంజూరు చేసిందన్నారు.

4,156 మంది ఉపాధ్యాయులకు బదిలీ

(ఐదో పేజీ తరువాయి)

పడ్డారు. స్పౌజ్ పాయింట్లు లేని కొందరు టీచర్లకు మేలైన స్థానాలు లభించడంతో వారు ఆనందంగా ఉన్నారు. మొత్తంగా టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ మొదట్లో గందరగోళంగా ఉన్నా తర్వాత సాఫీగా ముగిసింది. మునసబుపేటలోని గురజాడ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రాంగణంలోని కౌన్సిలింగ్ నిర్వహణలో డీఈవో, ఇతర అధికారుల బృందానికి ఉపాధ్యాయ సంఘాలు సహకరించడంతో ప్రక్రియ సజావుగా సాగింది. ఇదిలా ఉండగా.. ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీ ఆర్డర్లు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. బదిలీ అయిన ఎస్జీటీలంతా సోమవారం కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు బదిలీ అయిన ఉపాధ్యాయులంతా ఎంఈవో కార్యాలయాల్లో జాయినింగ్ ఆర్డర్లు తీసుకుని.. పాఠశాలలో విధులకు హాజరుకానున్నారు.

ఇక సచివాలయాల్లో..

(ఐదో పేజీ తరువాయి)

ఉద్యోగుల్లో బదిలీల సందడి నెలకొంది. జిల్లాలో 752 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 6,868 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో గతేడాది సెప్టెంబరులో సాధారణ బదిలీల్లో భాగంగా కొంతమంది స్థానచలనం అయ్యారు. కొందరు ఉద్యోగోన్నతిపై వెళ్లారు. ఈ సారి ఒకేచోట ఐదేళ్లు పూర్తయిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. రిక్వెస్ట్ బదిలీలకు కూడా అవకాశం ఇవ్వనున్నారు. దృష్టిలోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న ఉద్యోగులకు ప్రాధాన్యమివ్వనున్నారు. రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. జనాభా నిష్పత్తి మేరకు ఆరుగురు, ఏడుగురు, ఎనిమిది మంది సిబ్బంది ఉండేలా సచివాలయాను మూడు కేటగిరీలుగా విభజించారు. క్లస్టర్ పరిధిలో సిబ్బందిని హేతుబద్ధీకరణ ప్రామాణికంగా నియమించను న్నారు. మిగిలిన వారిని ఇతర శాఖలకు పంపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రక్షాళన చేపట్టనున్నారు.

సొంత మండలాన్ని వీడాల్సిందే..

వైసీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా సొంత మండలాల్లోనే చాలామంది సచివాలయ ఉద్యోగులను నియమించారు. దీంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సొంత మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వేరే ప్రాంతాలకు బదిలీ చేయాల్సిందేనని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దీంతో ఆయా ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తమకు అనుకూలంగా ఉన్న మండలాలు బదిలీ చేయించుకునేందుకు ఇప్పటినుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఎమ్మెల్యే సిఫారసు లేఖలు కోసం యత్నిస్తున్నారు.

తెరుస్తారా? లేదా?

(ఐదో పేజీ తరువాయి)

వారంతా ఉపాధి కోల్పోయారు. వాస్తవానికి జంట పట్టణాల్లో ఇతర కంపెనీలు లేకపోవడంతో కేవలం జీడి పరిశ్రమలపైనే ఆధారపడి వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. పీలింగ్, కటింగ్, బాయిలింగ్, జీడిపప్పు సైజు వేరుచేయడానికి.. వంటి పనులు కార్మికులు చేస్తుంటారు. ఉదయం 8 నుంచి రాత్రి వరకూ అవిశ్రాంతంగా చేస్తూ కుటుంబ భారాన్ని మోస్తుంటారు. ఈ నేపథ్యంలో 15 రోజులపాటు పరిశ్రమలు బంద్ కావడంతో వేలాది మంది కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు. నెలలో సగం రోజులు వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి చేజారిపోతుండడంతో శుక్రవారం కార్మికసంఘం నాయకులు అత్యవసర సమావేశాన్ని నిర్వహించి పరిశ్రమలు తక్షణమే తెరిపించాలని వ్యాపారసంఘం నాయకులకు లేఖలు అందించారు. దీనిపై వారి నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేదు. దీంతో సోమవారం పరిశ్రమలు తెరవాలని, లేదంటే వ్యాపారసంఘ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నారు. ● ఈ వ్యవహారంపై జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యాపారులకు నష్టాలు ఉన్నాయని, తమ సంఘం సభ్యులు మరో రెండు వారాలు గడువు కోరినా అంగీకరించ లేదన్నారు. కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా ఈ నెల 19వ తేదీ నుంచి పరిశ్రమలు తెరిపిస్తామన్నారు. ● కార్మిక సంఘం అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ తమకు సమాచారం ఇవ్వకుండానే పరిశ్రమలు బంద్ చేశారని, ఇచ్చిన గడువు 15 రోజుల తరువాత పరిశ్రమలు తెరిపించాల్సిందేనన్నారు. లేకుంటే కార్మికులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రజాకవి శ్రీశ్రీకి నివాళి

టెక్కలి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం సాయంత్రం యూటీఎఫ్, ప్రజా నాట్యమండలి ఆధ్వ ర్యంలో ప్రజాకవి శ్రీశ్రీ వర్ధంతి నిర్వహించారు. కష్టజీవులంటే శ్రీశ్రీకి ఎనలేని ఇష్టమని వక్తలు అన్నారు. శ్రీశ్రీ రచనలు, కవితలు వినిపించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకుడు కుప్పిలి కామేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు కురమాన దాలయ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పోలాకి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఈదులవలస విద్యుత్ ఫీడర్‌లో వ్యవసాయ విభాగంలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, ఏఈ విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లలవలస, తోటాడ, కొండలక్కివలస, కింజరాపువానిపేట గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండ దని, వినియోగదారులు గమనించాలన్నారు.

రేపు ఉర్లాం సబ్ స్టేషన్ పరిధిలో..

నరసన్నపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉర్లాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ చోడవరం ఫీడర్‌పై ఆర్‌డీఎస్ పనుల్లో భాగంగా కొత్త లైన్లు వేయనున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, ఏఈ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో నడగాం నుంచి సుందరాపురం వరకు అన్ని గ్రామాల్లో ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాతపట్నం మండలంలో..

పాతపట్నం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండలంలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈఈ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ పనుల్లో భాగంగా కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్నందున తిడ్డిమి, నవరతిడ్డిమి, చిన్నపద్మాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బుడితి సబ్ స్టేషన్ పరిధిలో..

జలుమూరు (సారవకోట), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బుడితి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుడితి విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ ఇండస్ట్రియల్ వడ్డినవలస ఫీడర్ పరిధిలో కొత్త సర్వీసులకు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బుడితి, అవలింగి, చీడిపూడి, తొగిరి, కిన్నెరవాడ, బద్రి, గుమ్మపాడు, బైదలాపురం, గోపాలపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

టెక్కలి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణి కులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రయా ణికులు సమస్యలను 9959225611 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 70 మంది ఎంపిక

టెక్కలి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసమితి పెద్దమందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు 207 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 70 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మందిరం కన్వీనర్ బి.మల్లేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.


కిడ్నీవ్యాధి నివారణకు సహకరించాలి

వజ్రపుకొత్తూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధి నివారణకు అందరూ సహకరించాలని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. ఆదివారం తోటపల్లిలో కిడ్నీ వ్యాధిగ్రస్థులకు వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇతర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

నేడు జమ్మలో అమ్మవారి ఉత్సవాలు

నరసన్నపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పాతపట్నం అమ్మవారి వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహ కులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించు కోవాలని కోరారు.

నీట్‌లో నీహారికకు 1,283వ ర్యాంకు


సాయి నిహారిక

జలుమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పర్లాం గ్రామానికి చెందిన కొబగాపు సాయి నీహారిక నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 1283వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 453 ర్యాంకు సాధించింది. తండ్రి కోటేశ్వరరావు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తల్లి వాహిని గృహిణి. నిరుపేద ఇంటిలో జన్మించి నీట్‌లో ప్రతిభ కనబరిచిన నీహారికను తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు అభినందించారు.